తొలిరోజు ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

ఉండి: పదోతరగతి పరీక్షలు మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో 658 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, యండగండి పరీక్షా కేంద్రంలో 156 మందికి 149 మంది, ఎన్నార్పీ అగ్రహారంలో 100 మందికి 91 మంది, ఉండి ఏ సెంటర్‌లో 155 మందికి 133 మంది, ఉండి బీ సెంటర్‌లో 179 మందికి 164 మంది, ఉప్పులూరులో 68 మందికి 57 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 658 మంది విద్యార్థులకు 594 మంది విద్యార్థులు హాజరయ్యారని 64 మంది గైర్హాజరైయ్యారని అధికారులు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తున్నామని పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా కట్టుదిట్టమైనట్లు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.



ఉండిలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



కాళ్లలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

కాళ్లలో 59 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాళ్ల హైస్కూల్లో 279 మందికి గాను 16, కోపల్లెలో 227 మందికిగాను 21, కలవపూడిలో 133 మందికిగాను 6, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్లో 192 మందికి గాను 16 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 49 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 831 మంది హాజరుకావాల్సి ఉండగా 772 మంది తొలి రోజు పరీక్ష రాసినట్లు వివరించారు.

వీరవాసరంలో 59 మంది గైర్హాజరు

వీరవాసరం: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వీరవాసరంలోని శ్రీమద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, డివైన్ మెర్సీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో 820 విద్యార్థులకు గాను 761 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

ఆకివీడులో 55 మంది గైర్హాజరు

ఆకివీడు: పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ రవీంద్ర చెప్పారు. మండలంలోని జెడ్పీ స్కూల్, చినకాపవరం జెడ్పీ స్కూల్, సెంట్ ఎలోషియస్ స్కూల్, నారాయణ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 826 మంది విద్యార్థులకు గానూ 771 మంది పరీక్షలకు హాజరుకాగా 55 మంది విద్యార్థులు పరీక్షలు రాయలేదని ఎంఈఓ చెప్పారు.

అపోస్ పరీక్షలకు 28 మంది గైర్హాజరు

మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో సోమవారం ఇంటర్‌మీడియట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (అపోస్) పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ ఏ.రవీంద్ర చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 253 మంది విద్యార్థులకు గాను 241 మంది, దుంపగడప గ్రామంలోని ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 224 మందికి గానూ 208 మంది హాజరుకాగా, మొత్తం 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

పాలకోడేరులో 55 మంది గైర్హాజరు

పాలకోడేరు: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 702 మంది విద్యార్థులు హాజరు అవ్వాల్సి ఉండగా 647 మంది విద్యార్థులు హాజరు కాగా, 55 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి-1 పెనుమత్స వెంకట శివ నాగరాజు చెప్పారు. పాఠశాలల వారీగా గొల్లలకోడేరు హైస్కూల్ నుంచి 137 మంది విద్యార్థులు గాను 127 మంది, పాలకోడేరు హైస్కూల్ నుంచి 176 మంది విద్యార్థులకు గాను 155 మంది, శృంగవృక్షం హైస్కూల్ నుంచి 170 మంది విద్యార్థులకు 160 మంది, విస్సాకోడేరు హైస్కూల్ నుంచి 79 విద్యార్థులు 74 మంది, మొగల్లు హైస్కూల్ నుంచి 140 మంది విద్యార్థులకు 128 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలియజేశారు.

భీమవరం మండలంలో 744 మంది హాజరు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సోమవారం నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 784 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 744 మంది హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. మండలంలోని అనాకోడేరు, చినఅమిరం, దిరుసుమర్రు, తుందుర్రు, గూట్లపాడు పరీక్షా కేంద్రాలలో తొలిరోజు తెలుగు పరీక్ష నిర్వహంచారు.

భీమవరంలో..

భీమవరంలో సోమవారం జరిగిన పరీక్షకు 2,167 మంది విద్యార్థులకు 2,118 మంది విద్యార్థులు హాజరయ్యారు. 49 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఈఓ గ్రేడ్-2 వేంద్ర వెంకటేశ్వరరావు చెప్పారు.

నేడు భీమేశ్వరస్వామి కల్యాణోత్సవం



పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడి అలంకరణలో మాణిక్యాంబ, భీమేశ్వరస్వామి వార్లు

ఆకివీడు: పట్టణంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయని ఆలయ చైర్మన్ గుర్రం హరినాథ్ చెప్పారు. తొలిరోజు గణపతి పూజ, త్రిశూల, వాస్తు పూజలు, దీక్షాధారణ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం రుద్రహోమం, సాయంత్రం 7 గంటలకు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వార్ల కల్యాణం జరుగుతుందని చెప్పారు. 20న గణపతి హోమం, మహా పూర్ణాహుతి, స్వామి వార్ల పవళింపు సేవలుంటాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: పెదఅమిరం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. గ్రామంతో పాటు ఇండస్ట్రియల్ ఏరియాలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి క్షీరాభిషేకాలు

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద పురాతన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠలో భాగంగా సోమవారం నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. జలాధివాసంలో ఉన్న విగ్రహాలకు ఆవుపాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద హోమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నేరెళ్ల రామకృష్ణ, మోటుపల్లి కృష్ణ, జంపన సుబ్రహ్మణ్యంరాజు (జేఎస్సార్), మోరా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగనుందని అభివృద్ధి కమిటీ తెలిపింది.

శ్రీపుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు



వాలమర్రులో ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాలమర్రు గ్రామ నడివీధిలో గ్రామ దేవత శ్రీపుంతలో ముసలమ్మ ఆలయ పునఃనిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గ్రామంలో గోపూజ నిర్వహించి, గోమాతతో గ్రామోత్సవం చేశారు. అర్చకస్వామి స్థభితి శ్రీనివాస్ సిద్ధాంతి (జక్కరం), అక్కిరాజు శర్మ శిష్య బృందం బ్రహ్మత్వంలో గ్రామ పెద్దలు నార్ని నారాయణస్వామి, వేంద్ర సింహాచలం, తమ్మా కోట నరసింహారావు, కడలి శ్రీను, సన్నిశెట్టి వెంకటప్రసాద్ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఈ నెల 20న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

నేటి నుంచి తిల్లపాయిలమ్మ జాతర

పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీ తిల్లపాయిలమ్మ, శ్రీ మారెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత కామిశెట్టి అయ్యప్పనాయుడు, సర్పంచ్ నడపన శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం అంతర్వేది సముద్ర స్నానానికి అమ్మవార్లను తీసుకువెళతామన్నారు. రాత్రి ఆసాదుల నృత్యాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, 25న గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు ఆశీల వేలం పాట

నరసాపురం: పట్టణంలోని డైలీ మార్కెట్ పన్నుల వసూళ్లపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు రూ.3 లక్షల ధరావత్తు చెల్లించాలని, రూ.5 లక్షలు సాల్వెన్సీ చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

దుర్గాలక్ష్మణేశ్వరస్వామి హుండీ లెక్కింపు

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామివారి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. భీమవరం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో రూ.3,55,089 ఆదాయం వచ్చినట్లు తెలియజేశారు. ఆలయం ఈవో చాగంటి సురేష్‌నాయుడు, చైర్మన్ కంకటాల పెద్దిరాజు, కవురు రామాంజనేయులు, చింతపల్లి త్యాగరాజు, ఆలయ సిబ్బంది డి.రామకృష్ణంరాజు, ఈవో బి.శ్రీనివాసరెడ్డి, ఎం.రమేష్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దంతులూరి వేణురాజుకు బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు



తెలంగాణ మంత్రుల నుంచి అవార్డు అందుకుంటున్న దంతులూరి వేణు

కాళ్ల: తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతులకు అందజేసే బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు-2023 దంతులూరి వేణురాజును వరించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్‌కు సంబంధించిన అత్యుత్తమ పనికి ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ఆక్వేక్స్ ఇండియా ఉత్పత్తుల వృద్ధితో పాటు ఇతర రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించే దిశగా కంపెనీ చేస్తున్న కృషిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశంసించారని తెలిపారు. ప్రతిభను గుర్తించి ఇచ్చిన అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. రైతులకు, హెచ్ఎంటీవీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉణుదుర్రులో 'మేము సిద్ధం.. బూత్ సిద్ధం'



ఉణుదుర్రులో మేము సిద్ధం అంటూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి గెలిపించడానికి మేము, మా బూత్ సిద్ధంగా ఉందని బూత్ కమిటీ అధ్యక్షులు కూనపరాజ వర్మ, జీ సుందర్‌కుమార్, పైలా సత్యనారాయణ అన్నారు. సోమవారం ఉణుదుర్రులో 'మేం సిద్ధం ..మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సీఎం వైఎస్ జగన్ పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు మంచి చేసిన వాళ్ళకు తిరిగి మంచి చేయడం కనీస ధర్మమని, దానినే తామంతా పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. ప్రతి నిరుపేదా రూ.లక్షాధికారిగా మారిపోయారని అన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా జగనన్న సంక్షేమ పథకాలు అందించారన్నారు. పేదలకు మరింత మంచి జరగాలంటే బిడ్డలు ఎంతో గొప్పవారు కావాలంటే మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని, ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల గెలిచితీరాలని అన్నారు. మనమంతా మంచిని గెలిపిద్దాం, మంచినే కోరుకుందామని వారన్నారు. ఈ కార్యక్రమంలోఅల్లూరి అంజిరాజు, గోపే మనోహరం, సైదు నాగలక్ష్మి, కడిమి రమేష్ రాజు, కొండుబోయిన నాగసూరి, కటికిరెడ్డి సతీష్, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉండిలో పీవీఎల్ గెలుపు ఖాయం



పీవీఎల్‌ను సత్కరిస్తున్న మేడిద జాన్సన్ తదితరులు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఎన్నికల్లో గెలుపొందడం ఖాయమని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఉండి నియోజకవర్గ అభ్యర్థిగా పీవీఎల్ పేరును ప్రకటించిన సందర్భంగా పీవీఎల్‌ను పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, రాష్ట్ర అధికార ప్రతినిధి, కాళ్ల మండలం ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు గుర్రం జార్జి బెన్‌హర్ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో నిత్యం ప్రజల్లోఉంటూ ప్రజలకు సేవ చేసిన పీవీఎల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర సీఎం జగన్‌దేనని అన్నారు. అవినీతికి తావు లేకుండా వర్గవిభేదాలు లేకుండా అన్నివర్గాల ప్రజలను అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆకాంక్షించారు. పీవీఎల్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అండ తనకు ఉందని చెప్పారు. మహిళలంతా సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎం.రవికుమార్, జాన్ ఎడ్వర్డ్, శ్యామ్ బాబు, రత్నకుమార్, అశోక్, కరుణాకర్, బాబీ పాల్గొన్నారు.

ఆదర్శ క్లబ్‌కు అవార్డుల పంట



ఉత్తమ అవార్డులు అందుకున్న ఆదర్శ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆకివీడు: సేవల్లో దూసుకుపోతున్న లయన్స్ ఆదర్శ క్లబ్‌కు అవార్డుల పంట పండింది. రీజియన్ స్థాయిలో ఉత్తమ క్లబ్‌తో పాటు ఉత్తమ అధ్యక్షుడి అవార్డును కైవశం చేసుకున్నారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన అవార్డుల కార్యక్రమంలో ఆదర్శ క్లబ్‌కు వచ్చిన అవార్డుల్ని క్లబ్ రీజియన్ సెక్రటరీ యు.శ్రీనివాసరాజు, అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు సోమవారం విలేకర్లకు వెల్లడించారు. ఉత్తమ క్లబ్‌గా ఆదర్శ లయన్స్, ఉత్తమ అధ్యక్షులుగా మోటుపల్లి శ్రీనివాసరావు, ప్రత్యేక ప్రోత్సాహక అవార్డులను యు.శ్రీనివాసరాజు, పల్లి రంగారెడ్డి, ఎస్.రామచెంచయ్య, కంటి విభాగం ఉత్తమ సేవలకు ఉత్తమ అవార్డును ఎండీ అహ్మద్ కైవశం చేసుకున్నారని చెప్పారు. ఆదర్శ లియో క్లబ్‌కు ఆరు సర్వీసు అవార్డులు లభించినట్లు చెప్పారు. ఆదర్శక్లబ్ ప్రతినిధులు మోరా జ్యోతిరెడ్డి, గొంట్లా కృష్ణ, మోటుపల్లి సత్యనారాయణ, ఓలేటి శ్రీనివాసరావు, మత్తి రమేష్, ఈవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సహాయం

బీటెక్ ఫైనలియర్ చదువుతున్న పీ నాగతేజకు ఆదర్శ లయన్స్ క్లబ్ రూ.7,700 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాలేజీలో హాస్టల్ ఫీజు కట్టేందుకు సహకరించాలని విద్యార్థి తండ్రి సీతారామయ్య కోరడంతో సభ్యులు సహాయం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు.

శ్మశాన వాటిక సర్వే పనుల పరిశీలన



వాండ్రంలంక శ్మశాన వాటిక సర్వే పనులను పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఉండి: వాండ్రం గ్రామ శివారు వాండ్రం లంకలో దళిత భూముల అన్యాక్రాంతం ఫిర్యాదుపై ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామంలో నిర్వహించిన శ్మశాన వాటిక సర్వే పనులను భీమవరం డీఎస్పీ డి.నారాయణస్వామిరెడ్డి పరిశీలించారు. అనంతరం స్థానిక దళితులతో మాట్లాడి ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారి వివరాలు, వారి అభిప్రాయాలను సేకరించారు. గతంలో, ఇటీవల కాలంలో జరిగిన విషయాలను డీఎస్పీ వివరంగా అడిగి తెలుసుకున్నారు. అన్నింటినీ పరిశీలించి తప్పక న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

వాండ్రంలంకలో శ్మశానవాటికను ఆక్రమించుకుని దళితుల క్షోభకు కారణమైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని వాండ్రంలంకకు సోమవారం వచ్చిన డీఎస్పీ వెంటకరెడ్డిని కలిసి కోరినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విలేకరులకు చెప్పారు. అనంతరం స్థానికులతో జరిగిన సమావేశంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి జేవీటీ నాయుడు, వీఆర్వోలతో శ్మశానవాటిక కొలతలపై సమావేశం నిర్వహించారు. ఆక్రమణకు గురైన 77 సెంట్ల భూమికి ఉన్నతాధికారులతో మాట్లాడి ఫెన్సింగ్ వేసి అప్పగిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు పుష్పరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్, యూత్ అధ్యక్షుడు మేడిది సాయిజగన్నాథ్, మండలాధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజ్, కేదాసి నాగరాజు, కుసుమే వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజలు, దళిత నాయకులు, ఎస్సై ఎం.లక్ష్మణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

పెనుగొండ: విధుల్లో అలసత్వం వహించిన పోడూరు, కవిటం, నెగ్గిపూడి, నడిపూడి గ్రామాల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎన్నికల అధికారి స్వామినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఆయా గ్రామాల్లో విగ్రహాలకు ముసుగు వేయడం, రాజకీయ ఫ్లెక్సీల తొలగింపులో అలసత్వం వహించడంతో ఈ మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు బ్రాడీపేటలో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 1వ వార్డు బ్రాడీపేట 1వ వీధి నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని వారు కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



జిల్లా ఖజానా గణాంక అధికారి గణేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ నమోదు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు కోరారు. భీమవరం సబ్ ట్రెజరీ కార్యాలయం తనిఖీలో భాగంగా భీమవరం వచ్చిన జిల్లా ఖజానా గణాంక అధికారి ఎ.గణేష్‌ను భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీ భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కే చాన్ బాషా, సీనియర్ పెన్షనర్స్ బి.సత్యనారాయణ రాజు, చెరుకువాడ రంగసాయి, జీఎస్ రాజు వారిని కలిసి పలు సమస్యలపై వినతులు అందించి సత్కరించారు.

సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కాజలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

యలమంచిలి: దాళ్వాలో కాలువ శివారు భూములకు సైతం సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ చెప్పారు. కాజ గ్రామానికి చెందిన రైతులు కాల్వ శివారు భూములకు సాగునీరు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆర్డీఓ అధికారులతో కలిసి కాజ గ్రామంలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తడారిన చేలను చూపించారు. దీంతో అంబరీష్ అక్కడే ఉన్న ఇరిగేషన్ డీఈ సీహెచ్ సత్యనారాయణ నుంచి వివరణ కోరారు. డీఈ సత్యనారాయణ ప్రస్తుతం వంతుల వారీ విధానం అమలులో ఉందని, ఈ నెల 21న ఈ పంట కాల్వకు వంతు వస్తుందని, ఆ సమయంలో ప్రతి చేనుకు నీరు అందిస్తామని చెప్పారు. దీనిపై అంబరీష్ స్పందిస్తూ ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, ఏఓ చిందులూరి దేవి, ఇరిగేషన్ ఏఈ సల్లపూడి శ్రీనివాస్ ఉన్నారు.

20న కనకదుర్గ మల్లేశ్వరస్వామి కల్యాణం



శ్రీ కనకదుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 27వతేదీ వరకు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7.15 గంటలకు అమ్మవారి ధ్వజారోహణము పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం రాత్రి 7.29 గంటలకు కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం, గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఊరేగింపు, శుక్రవారం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, శనివారం రాత్రి దర్బారుసేవ, సోమవారం ఉదయం పూర్ణాహుతి, దండాడింపు ఉత్సవము, త్రిశూలస్నానం రాత్రి 7 గంటలకు అమ్మవారికి లక్ష చామంతి పువ్వులతో పూజ, మంగళవారం లక్ష గాజుల పూజ, బుధవారం ఏకాంతసేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవ కార్యక్రమాలు ముంగించనున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ఈవో యస్ సతీష్‌కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు రేలంగి నరసింహమూర్తి, గవర రవిశంకర్, గుండుబోయిన అరుణకుమారి,దాసరి దివ్యశ్రీ ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొన్నారు.

దళితులంతా ఐక్యంగా ఉండాలి

పోడూరు: సంక్షేమం, అభివృద్ధి కోసం దళితులందరూ ఐక్యంగా ఉండాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ కోరారు. పండితవిల్లూరులో సోమవారం సంఘ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్ అధ్యక్షతన ఈ సమావే శం జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, ఉపాధ్యక్షుడు సర్రెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజును కలిసిన విన్స్‌టన్‌బాబు

పోడూరు: ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును తూర్పుపాలెంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు కుంచలపల్లి విన్‌స్టన్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీరంగనాథరాజు పేరును ప్రకటించడంపై విన్‌స్టన్‌బాబు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. విన్‌స్టన్‌బాబుతో పాటు పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నర్సయ్య, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి మరపట్ల ప్రవీణ్‌కుమార్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి సాలా శ్రీను, జాన్ తదితరులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలిసి అభినందనలు తెలిపారు.

